


# ఇచ్చట సూరిటీలు ఇవ్వబడును

## వేదగిరి రాంబాబు

ఇంట్లోంచి రోడ్డు మీదకి అడుగుపెట్టగానే నాకు తెలీకుండానే నా కళ్ళు అటు తిరిగాయి.

పంచర్ వేస్తున్న సైకిల్ ట్యూబ్‌ని కాస్త కింద పారేసి చటుక్కున లేచి నిలబడి "నమస్కారం సార్..." అన్నాడతను.

గర్వంగా అనిపించింది.

తల పంకించి ముందుకు కదిలాను.

గత కొన్ని రోజులుగా రోజూ జరుగుతున్న తంతే ఇది! అయినా అతనలా గౌరవంగా నమస్కారం పెట్టేసరికి ప్రతిరోజూ ఒకే తియ్యని అనుభూతి! దాంట్లో మార్పు లేదు.

కానీ ఆ రోజు మాత్రం అతను ప్రతీరోజూ జరిగేదానికి భిన్నంగా గబగబా నా వేపు వచ్చాడు.

"ఏమిటి రాములూ?" అడిగాను.

"ఏం లేదు బాబూ... మీతో కొద్దిగా మాట్లాడదామని..." నసిగాడు.

వాడి వినయం నన్ను అడుగు ముందుకు వెయ్యనివ్వలేదు.

"చెప్పు" అక్కడే నిలబడి అడిగాను.

"మీరు నన్ను రెండు మూడు నెలలుగా చూస్తున్నారు కదా! తెల్లారే మొదలు చీకటి పడిందాకా సైకిళ్ళని రిపేర్లు చేస్తున్నా తిండికి గడవడం లేదు... బాంక్‌లో లోను తీసుకుని కొన్ని సైకిళ్ళను అద్దెకు తిప్పుకుందామని..."


"ఈ దరిదాపులో ఎక్కడా అద్దెకి సైకిళ్ళ నిచ్చే షాపులు లేవు నువ్వు పెడితే బాగానే వుంటుంది" అతని ఆలోచన నిజంగా నాకూ నచ్చింది.

"బాంక్‌లో లోనివ్వాలంటే మీ లాంటి వాళ్ళ సూరిటీ కావాలట బాబూ..." అసలు విషయాన్ని నెమ్మదిగా చెప్పాడు. ఉపోద్ఘాతమంతా దీని కోసమన్న మాట!

నా ఆలోచనలని అనుమానంగా భావించినట్లున్నాడు. "మీరు దయ తలిస్తే నేను బతుకుతాను బాబూ... ప్రతినెలా ఇంతని కడుతూ బాకీని చెల్లకొట్టుకుంటాను..."

అతనక్కడెక్కడో అడ్డగుట్ట గుడిసెల్లో వుంటాడని విన్నాను. మా ఇంటి ముందు సైకిల్ రిపేర్ షాపు పెట్టకముందు అతన్ని చూడను కూడా చూడలేదు. ఎలా ఇతనికి సూరిటీ ఇవ్వడం?

"సందేహించకండి బాబూ... సైకిళ్ళని మీ కాంపౌండ్‌లోనే పెట్టి వెళ్తాను... నాకు నా పిల్లలకి తిండి పెట్టిన వాళ్ళవుతారు..." దాదాపు కాళ్ళు పట్టుకున్నంత పని చేసాడు.




జాలేసింది.. ఇంతగా నన్ను గౌరవిస్తున్న, నా మీద అభిమానం చూపుతున్న మనిషిని బాధించడం భావ్యం కాదనిపించింది.

కేవలం నా సంతకం సాయంతో ఓ కుటుంబం బతుకుతుంది. నా సంతకానికి అంత విలువుంది! గర్వంగా అనిపించింది.

"బాబూ..." వాడు ప్రాధేయ పడుతున్నాడు.

నేను డబ్బు సాయం చెయ్యనక్కరలేదుగా? ఇచ్చేది బాంకు వాళ్ళు... పుచ్చుకునేది అతను! కానీ మధ్యలో నా సంతకానికి ఎక్కువవిలువ!!

"సరే..." అభయమిచ్చాను.

రాములు పరమానంద భరితుడై పోయాడు. వాడికి అంత ఆనందాన్ని కలిగించినందుకు నా మీద నాకే అభిమానం కలిగింది.

రాములుతో నేనూ బాంక్‌కి వెళ్ళడం, అక్కడ సూరిటీ బాండ్‌మీద సైన్ చెయ్యడం, వాడికి కొత్త సైకిళ్ళు రావడం ఒక వారం రోజుల్లో జరిగిపోయింది.

మా ఇంటి ఎదురుగానే రోడ్డుకి అవతల ఖాళీ జాగాలో నాల్గు బొంగులపైన ఓ తడికని నిలబెట్టి దాని కింద సైకిల్ షాప్‌ని ప్రారంభించాడు.

చీకటి పడిన తర్వాత కొట్టు కట్టేయగానే ఆ సైకిళ్ళను తీసుకొచ్చి మా కాంపౌండ్‌లో పెట్టి తాళం వేసుకుని వెళ్ళిపోయేవాడు.

మరో నెల రోజులు కూడా తిరక్క ముందే నమస్కారాలు పెట్టేవాళ్ళు నాకే కాదు మా ఆవిడకీ వున్నారని అర్థమైంది.

"మనమంటే ఆ లక్ష్మికి ఎంతో గౌరవముందండి... మనింట్లో పని చేయడానికి జేరకముందు కూడా నేనెక్కడ కనిపించినా నమస్కారం పెట్టి, ఎంతో గౌరవంగా పలకరించేది..." మా ఆవిడ నాన్‌స్టాప్‌గా చెప్పుకు పోతోంది. నాకు విషయం అర్థం కావడంలేదు.

"అయితే ఏమిటంటావ్?" అడిగాను.

"వాళ్ళ పాక పడిపోయిందిటండీ పాపం... కొత్త ఇళ్ళు వేసుకోడానికి బాంక్‌వాళ్ళు నెల నెలా తీర్చుకునే పద్ధతి మీద తలా కొంత పాకల్లో వున్న వాళ్ళందరికీ అప్పులు ఇస్తున్నారట. మీరు సూరిటీ సైన్ చేస్తే బావుంటుందని ప్రాధేయ పడింది." వులిక్కి పడ్డాను.

ఇలా నమస్కారాలు పెట్టిన వాళ్ళందరికీ సూరిటీలు ఇచ్చుకుంటూ పోతే ఇంకా ఎంతమంది కోసం బాంక్ చుట్టూ తిరగాలో!!

"మొన్ననే గదే రాములుకిచ్చింది..."

"అతనికిస్తే ఈమె కేమిటండీ? అయినా మీరేమీ జేబులోంచి ఇవ్వనక్కర్లేదుగా! చిన్న సంతకం పెడితే చాలు. వాళ్ళ తిప్పలు వాళ్ళు పడతారు..."

"రెగ్యులర్‌గా ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టకపోతే తిప్పలు పడేది వాళ్ళు గాదు మనం..."

"మీకా భయం ఏమీ అక్కర్లేదు లెండి. మనం తనకిచ్చే యాభైరూపాయల్నీ తీసుకెళ్ళి ప్రతీనెలా బాంక్‌లో కడుతుంది..."

తనలా పనిమనిషిని వెనకేసుకొచ్చేసరికి కాదనలేక పోయాను. మర్నాడే మళ్ళీ బాంక్‌కి వెళ్ళి మా పనిమనిషి లక్ష్మికి కూడా సూరిటీ ఇచ్చి వ


చ్చాను. నాది నాలుగంకెల జీతం కావడంతో వారం కూడా తిరక్కా ముందే రెండోసారి సూరిటీ ఇవ్వడానికి వచ్చినా బాంక్‌లో వాళ్ళు కిమ్మనలేదు.

రాములు నమస్కారాలతో నేను, లక్ష్మి నమస్కారాలతో మా ఆవిడా వుబ్బి తబ్బిబ్బవుతుంటే నెలరోజులునాలుగు క్షణాల్లా గడిచిపోయాయి.

ఆ రోజు ఆఫీసు నుంచీ వచ్చే సరికి "చూశారా! ఇదెంత పని చేసిందో..." గుమ్మంలోనే ఎదురొచ్చింది మా ఆవిడ.

"ఎవరు? ఏమిటి?"

జీతం ఇవ్వగానే వెళ్ళి బాంక్‌లో కట్టి రమ్మన్నాను. అలాగే అని దాటేసింది. జీతం ఇచ్చి వారం రోజులైనా బాంక్‌లో ఒక్క పైసా కూడా కట్టి రాలేదు. ఇవాళ కాస్త గట్టిగా అడిగేసరికి కోపం వచ్చి వెళ్ళిపోయింది."







"అయితే రేపటి నుంచీ పనికి రాదా?" నా గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి.

"అది వస్తే మాత్రం నేను దానిచేత పని చేయించు కుంటానుటండీ?"

"మన కళ్ళెదురుగా వుంటేనే బాంక్‌లో ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టనిది మనకి కనిపించని దూరంలో వుంటే ఏమి కడుతుందే! అది కట్టక పోయిందంటే నేను కట్టుకోవాలి."

నేను భయపడ్డంతా జరిగింది. మరో మూడు నెలల తరువాత బాంకు నుంచి నాకో వుత్తరం వచ్చింది, మీరు సూరిటీ ఇచ్చిన లక్ష్మి అనే ఆవిడ అప్పు తీసుకున్న తర్వాత ఇంతవరకూ ఒక్క పైసా కూడా జమ వెయ్యలేదని, వెంటనే ఆమె కొంతయినా జమ చేసేటట్లు చూడమని! రాములు విషయంలో ఇటువంటి ఉత్తరం రాలేదు కాబట్టి అతను కడుతున్నాడన్న మాట!

వెంటనే రాముల్ని తీసుకుని లక్ష్మి గుడిసె వెదుక్కుంటూ బయల్దేరాను. అరగంట వెదికిన తర్వాత ఆమె వుండే గుడిసె తెలిసింది. కానీ అప్పటికే ఆమె ఆ స్థలాన్ని ఖాళీ చేసి వెళ్ళి పోయిందని కూడా తెలిసింది.

బాంక్‌లో తీసుకున్న అప్పుతో ఆమె ఆ గుడిసెని ఏమీ బాగు చేయించలేదు. పైగా మొన్నీ మధ్యనే దాన్ని అమ్మేసిందట కూడా!

లక్ష్మి మీద కోపమంతా మా ఆవిడ మీదకి మళ్ళింది. ఇంటికెళ్ళి నానా గొడవా చేసేను. సొమ్మూ పోయింది, శనీ చుట్టుకుంది అన్నట్లు డబ్బూ కట్టుకోవలసి వచ్చింది. మా ఆవిడ కోపంతో బిగుసుకు పోయింది.

మరో నెల రోజులు కూడా తిరక్కముందే మా ఆవిడకి ఆనందం, నాకు గుండెలు పగలగొట్టే సంఘటన జరిగింది.

పొద్దున లేవగానే వాకిట్లోకి వచ్చిన నాకు సైకిళ్ళు కనిపించలేదు. ఒకవేళ రాములేమైనా తీసుకెళ్ళాడేమో లే అని కాసేపు సరిపెట్టుకున్నాను. నేను ఆఫీస్‌కి వెళ్ళే టైమైనా రాములూ రాలేదు, సైకిళ్ళూ రాలేదు.

ఆఫీసుకి వెళ్ళిన తర్వాత కూడా నా మనసంతా ఏం జరిగిందోనని కొట్టుకొంటూనే వుంది.

సాయంత్రం సరాసరి రాములు వుండే ఇంటివేపు వెళ్ళాము.

అక్కడ విన్న వార్త నా గుండెల్ని పగలగొట్టింది. రాములు సైకిళ్ళని తీసుకుని రాత్రికి రాత్రే ఎటో పరారైపోయాడు.

అంటే ఈ సొమ్ము నేనే కట్టుకోవాలన్నమాట!

జరిగిన దానికి బాధ పడడం మాటటుంచి దెప్పి పొడవడం ప్రారంభించింది మా ఆవిడ. నిజమే! లక్ష్మికన్నా రాములుకి సూరిటీ ద్వారా ఇప్పించిన అప్పే ఎక్కువ!

బాంక్‌కి వెళ్ళి రిపోర్టు ఇచ్చాను.

వాళ్ళు ఒకవేళ దొరక్కపోతే సూరిటీ ఇచ్చిన ఖర్మానికి ఆ సొమ్మంతటినీ మీరే చెల్లించాలన్నారు. కాకపోతే మేనేజర్‌గారు జాలితో ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చెల్లించుకొమ్మన్నారు.

వెంటనే కోర్టులో పనిచేస్తున్న ఓ స్నేహితుడుంటే అతని దగ్గరికి పరుగెత్తాను. 'పారిపోయిన వాళ్ళ మీద లీగల్‌గా మనం ఎటువంటి యాక్షనూ తీసుకోలేము. అతను బాంకుకి అప్పున్నాడు. బాంక్ అతనికి అప్పు ఇచ్చింది. మధ్యలో నువ్వు సూరిటీ ఇచ్చావు అంతే! సూరిటీ ఇచ్చినవాడికి ఎటువంటి రైటూ లేదు. కాకపోతే అప్పు తీసుకున్నవాడు పారిపోతే వీడు కట్టితీరాలి' అన్నాడు.

ఇంకెవరి దగ్గరకూ పరుగెత్తడం అనవసరం అనిపించింది. వెంటనే ఆసొమ్ముని కట్టేస్తే వడ్డీ భారమైనా తగ్గుతుందని పించింది.

కనిపించిన వాడికల్లా 'నమస్కారాలు' పెట్టుకుంటూ 'అప్పు'కి బయల్దేరాను. కానీ నా నమస్కారాలకి అయిసైపోయేవాడు మాత్రం ఎక్కడా కనిపించలేదు.

*

